ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కర్నూలు
జిల్లా వార్తలు 5
మంగళవారం 5 నవంబరు 2024

పొత్తుకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం


మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

సమన్వయ బాధ్యత ఎమ్మెల్యేలదే

- సాగునీరు, సహకార ఎన్నికలపై దృష్టి సారించండి
- సీమ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చిన ఘనత ఎన్టీఆర్, చంద్రబాబులదే
- వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులు చేపడుతాం
- కప్పట్రాళ్ల యురేనియం పాపం వైసీపీదే
- టిడ్కో ఇళ్లపై త్వరలో కీలక నిర్ణయం.. డ్రోన్ హబ్‌గా కర్నూలు
- జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

కర్నూలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొత్తు ధర్మాన్ని అందరూ విధిగా పాటించాలి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను సమన్వయం చేసుకొని సమష్టిగా ముందుకు నడవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపైనే ఉందని జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం మంత్రి టీజీ భరత్‌తో కలసి నిమ్మల సుడిగాలి పర్యటన చేశారు. స్టేట్ గెస్ట్‌హౌస్‌లో వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి ఉల్లి రైతులతో మాట్లాడారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశమై నియోజవర్గాలలో చేపట్టాల్సిన అభివృద్ధి, అసంపూర్తి పనులపై చర్చించారు. ఆయా నియోజకవర్గాల్లో కూటమి నేతల మధ్య నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, బీజేపీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, జనసేన అధ్యక్షుడు చింతా సురేశ్‌బాబు హాజరు అయ్యారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల ముఖ్య నాయకుల నుంచి జిల్లా అభివృద్ధిపై సూచనలు స్వీరించారు. నాయకులు వెల్లడించిన ప్రతి అంశాన్ని ప్రత్యేకంగా మంత్రి నిమ్మల నోట్ చేసుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి అధ్యక్షతన జరిగిన కూటమి ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ ముఖద్వారం కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పని చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. కర్నూలును ప్రగతి పథంలో ప్రథమ స్థానంలో నిలుపుతానని, డ్రోన్ హబ్‌గా మారుస్తానని వివరించారు. ఉచిత ఇసుక విధానం ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తుందని, ఏ పార్టీ నాయకుడైనా సరే ఇసుక వ్యాపారం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు.

మిగతా 6లో..


సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, నాయకులు

తల్లిని వద్దన్న బిడ్డలపై కేసు!

- సుమోటోగా స్వీకరించిన పోలీసులు
- సీనియర్ సిటిజన్ యాక్ట్ కేసు నమోదు



పత్తికొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నడిరోడ్డుపై తల్లిని కర్కశంగా వదిలేసిన బిడ్డలపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులుగా తల్లిని తీసుకెళ్లాలంటూ పోలీసులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. రెండు పర్యాయాలు కుమారుడు, కుమార్తెలకు కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ వారిలో మార్పు రాలేదు. దీంతో కుమారుడు శ్రీనివాసులు కుమార్తెలు శ్రీదేవి, సరస్వతిలపై సీనియర్ సిటిజన్స్ ప్రొటెక్షన్ యాక్ట్, సెక్షన్ 24 ప్రకారం సుమోటోగా కేసు నమోదు చేసినట్లు పత్తికొండ సీఐ జయన్న వెల్లడించారు. పత్తికొండ పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వెనుక కాలనీలో వృద్ధురాలు తిరుపతమ్మను కన్న కొడుకు శ్రీనివాసులు శనివారం రోడ్డుపై వదిలేసి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో కుమారుడు, కుమార్తెలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినా వారు తల్లిని తమతో పాటు తీసుకెళ్లేందుకు నిరాకరించారు. అందుకే వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఆర్డీవోకు సమాచారం ఇచ్చామన్నారు. కుమారుడు, కుమార్తెలను మంగళవారం ఆర్డీఓ కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న వృద్ధురాలు తిరుపతమ్మ కోలుకున్నాక అనాథ ఆశ్రమానికి తరలిస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న సీఐ జయన్న

ఆందోళన వద్దు

- ప్రజలకు నష్టం కలిగే పనులు చేయం
- జలవనరుల శాఖకు పూర్వ వైభవం తీసుకువస్తాం
- డీఆర్సీ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు

7

పుట్టగొడుగుల్లా వెంచర్లు

- ల్యాండ్ కన్వర్షన్ అనుమతి లేకుండానే విక్రయాలు
- నష్టపోతున్న కొనుగోలుదారులు

ఎరువుల కొరత లేదు

- గ్రామాల్లో అన్ని ఎరువులు రైతులకు అందుబాటులో
- మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగారు రాజు

7

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 88 ఫిర్యాదులు

6



ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒక్కటైన శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కార్తీక మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణికి దశవిధ హారతుల కార్యక్రమాలను దేవస్థానం వైభవంగా నిర్వహించింది. - శ్రీశైలం

యురేనియంపై తిరగబడ్డ పల్లె జనం

- ఈదుల దేవరబండ వద్ద రహదారి దిగ్బంధం
- ఆందోళనలో గోనెగండ్ల, క్రిష్ణగిరి మండలాల ప్రజలు


పురుగుల మందు డబ్బాతో ధర్నాలో మహిళ


కర్నూలు -బళ్లారి రహదారిపై ఈదుల దేవరబండ వద్ద రోడ్డు దిగ్బంధనం

దేవనకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : యురేనియం తవ్వకాలకు వ్యతిరేక పల్లెజనం గళమెత్తారు. ప్రమాదకరమైన తవ్వకాలతో తమ పొలాలు పంటలు పండక నాశనమైపోతాయని, రోగాలబారినపడి జీవశ్చవాలుగా మారుతామని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని ఈదుల దేవరబండ వద్ద కర్నూలు-బళ్లారి రహదారిపై దాదాపు నాలుగు గంటలపాటు ధర్నా చేసి రాకపోకలు జరగకుండా రహదారి దిగ్బంధనం చేశారు. మండలంలోని పి.కోటకొండ, గుండ్లకొండ, బేతపల్లి, చెలెలచెలిమల, గుడిమిరాళ్ల, బంటుపల్లి, ఈదులదేవరబండ, గోనెగండ్ల మండలంలోని కున్నూరు, వీరంపల్లి, బోదెపాడు, క్రిష్ణగిరి మండలం తెగడొడ్డి, ఆగవేళ్లి గ్రామాల ప్రజలు పెద్దఎత్తున రహదారి దిగ్బంధనంలో పాల్గొన్నారు. తమ జీవితాలను నాశనం చేసే యురేనియం తవ్వకాలను వెనక్కి తీసుకోవాలని మహిళలు పురుగుల మందు డబ్బాలతో నిరసన చేశారు. పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్, ఆటవీశాఖ డీఎస్పీ తేజస్వి , డీఎస్పీ వెంకటరామయ్య ధర్నాను విరమించి, దేవనకొండ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి సమావేశంలో తమ సమస్యలు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. అయినా నిరసనకారులు ఆ సమావేశాన్ని బహిష్కరించారు. యురేనియం తవ్వకాలకు ప్రభుత్వ 68 బోర్లను వెనక్కి తీసుకొనే వరకు ఉద్యమం కొనసాగిస్తామని అన్నారు. దశలవారీగా ఉద్యమాన్ని వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. నాలుగు గంటల పాటు నిర్వహించిన ధర్నాతో మూడు కిలోమీట్లర మేర వాహనాలు నిలిచిపోయాయి.


రహదారి పై అడ్డుగా ముళ్ల కంచె వేసి నిరసన తెలపడంతో నిలిచిపోయిన వాహనాలు

భూమి పాడైపోతుంది


మేం వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాం. యురేనియం తవ్వకాల వల్ల వెలువడే కాలుష్యంతో భూమి పాడైపోతుంది. పంటలు పండకపోతే మేం ఎలా బతకాలి. రైతుల కష్టాలను గుర్తించి ప్రభుత్వాలు తవ్వకాలను వెనక్కి తీసుకోవాలి.

వడ్డె చంద్ర, గుండ్లకొండ

ఎంతకాలమైనా పోరాడతాం:


యురేనియం తవ్వకాలతో నీళ్లు కలుషితమవుతాయని, పంటలు పండవని, మనుషులకు రోగాలు వస్తాయని బ్యానర్‌లలో చూశాం. మా పిల్లల కోసం కష్టపడే మాకు వాళ్లకే హాని చేసే యురేనియం తవ్వకాలను ఆపే దాకా పోరాడుతాం.

-జీసీ లక్ష్మీదేవి, కున్నూరు గ్రామం, గోనెగండ్ల మండలం

పరీక్షల నిమిత్తమే బోర్లు:


యురేయం పరీక్షల కోసమే ఫారెస్టులో 68 బోర్లు వేయడానికి అనుమతులు వచ్చాయి. యురేనియం తవ్వకాల మీద సమీప గ్రామాల ప్రజలకు సందేహాలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి.

- తేజస్వి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్

అనవసరంగా రెచ్చగొడుతున్నారు


యురేనియం తవ్వకాలపై కొందరు ప్రజలను రెచ్చగొడుతున్నారు. అధికారులకు అవగాహన లేదని మీడియా, సోషల్ మీడియా, ప్రింట్ మీడియాలో అపోహలు ప్రచారం చేయరాదు.

- వెంకటరామయ్య, డీఎస్పీ, పత్తికొండ

సత్తా చాటారు..

టెట్ ఫలితాల్లో జిల్లా అభ్యర్థుల ప్రతిభ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో మహిళా అభ్యర్థులు అగ్రస్థానంలో నిలిచారు. కోసిగికి చెందిన ఎం.సువర్ణ 146.89 /150 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచారు. అలాగే సబా అంజుమ్ 142.63 మార్కులు, బి.లక్ష్మీశ్వరి 142.3, సోమశేఖర్ 141.53 మార్కులు, విజయ శశికళ 138.11 మార్కులు సాధించారు. ఈ ఉపాధ్యాయ అర్హత పరీక్ష అక్టోబరు 3 నుంచి 21వ తేదీ వరకు కొనసాగింది. జిల్లా నుంచి 54,083 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలులో 4, హైదరాబాదులో 2, ఆదోని, ఎమ్మిగనూరు ఒక్కొక్కటి చొప్పున పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. టెట్ ఫలితాల్లో 52 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. టెట్ ప్రక్రియ పూర్తి కావడంతో అభ్యర్థులు డీఎస్సీపైనే దృష్టి పెట్టనున్నారు.

నిరంతరం కృషి ఫలితమే


డీఎస్సీ నోటిఫికేషన్ కోసం కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్నాం. సొంత గ్రామం బెళగల్. నాన్న శేషప్ప, అమ్మ దుర్గమ్మ. 2014-16లో బీఈడీ పూర్తి చేశాను. 2018 డీఎస్సీలో 68 మార్కులు వచ్చినా ఉద్యోగం రాలేదు. మరింత కసితో 2019 నుంచి కోచింగ్ సెంటరులో శిక్షణ తీసుకుంటున్నాను. ఉద్యోగం సాధించే వరకు పోరాటం ఆగదు.

- ఎం.సోమశేఖర్, (141.53 మార్కులు)

ఆనందంగా ఉంది..


టెట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు రావడం సంతోషంగా ఉంది. డీఎస్సీలో ఉద్యోగం సాధిస్తానని ఆశ ఉంది. సత్యసాయి జిల్లా గోరంట్ల సొంత గ్రామం. అమ్మ, నాన్నలు ఫరీద, ఆజాద్‌లు. 2017-19లో బీఈడీ పూర్తయింది. బుక్కపట్నంలో టీటీసీ పూర్తి చేసుకున్నాను. ప్రస్తుతం ఎంఏ చదువుతున్నా. గత ప్రభుత్వం ఫిబ్రవరిలో నిర్వహించిన టెట్ పరీక్షలో 138 మార్కులు వచ్చాయి. ఈసారి 142.63 మార్కులు సాధించడం మరింత ఆనందాన్నిస్తోంది. త్వరలో విడుదల కానున్న డీఎస్సీపై దృష్టి పెట్టాను.

ఎస్. సబా అంజుమ్(142.63 మార్కులు), శ్రీ సత్యసాయి జిల్లా, గోరంట్ల



ప్రణాళికబద్ధంగా చదవడం వల్లే..

2014లో బీఈడీ పూర్తయింది. 2018లో జరిగిన డీఎస్సీలో 72 మార్కులు వచ్చాయి. సండే ఎగ్జామ్, వీక్లి టెస్టులు, డైలీ టెస్టులు, కోచింగ్ ఫ్యాకల్టీ సూచనలతో ప్రణాళికాబద్ధంగా చదవడం వల్లే టెట్‌లో మంచి మార్కులు సాధించాను.

- విజయ శశికళ (138.11 మార్కులు), కర్నూలు



సువర్ణ అవకాశం

146.89 మార్కులతో కోసిగి అభ్యర్థిని జిల్లా టాప్

అవుకు వాసి స్టేట్ టాప్

150 మార్కులు

6 లో



లోకాయుక్త జోక్యంతో వికలాంగుడికి పింఛన్

కర్నూలు లీగల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యంతో బాధపడుతున్న ఒక యువకుడి అవస్థ చూసి చలించిన రాష్ట్ర లోకాయుక్త ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం అతడికి పింఛన్ మంజూరు చేసింది. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం కామచిన్నయ్యపల్లె గ్రామానికి చెందిన ఎస్. హర్ష అనే యువకుడు అంగవైకల్యంతో మంచానికే పరిమితమై నానా అవస్థలు పడుతున్నాడు. రాష్ట్ర వికలాంగుల సంక్షేమ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఏ. మోహన్‌రావు ఆ యువకుడి అవస్థలను రాష్ట్ర లోకాయుక్త దృష్టికి తీసుకువచ్చాడు. ఈ మేరకు రాష్ట్ర లోకాయుక్త ఆ యువకుడి పరిస్థితిపై చలించి రాష్ట్ర ప్రభుత్వానికి వివరణ కోరింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ యువకుడికి నెలకు రూ.15వేలు చొప్పున పింఛన్ మంజూరు చేసి ఆ యువకుడికి అందజేసింది. దీంతో రాష్ట్ర లోకాయుక్త ఆ ఫిర్యాదును ముగించినట్లు లోకాయుక్త రిజిస్ట్రార్ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆన్‌లైన్ కథలు

ఊ కొడతారా కథ చెబుతా

- సోషల్ మీడియాలో బాలలకు సాహిత్యం
- యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, టెలిగ్రామ్‌లలో వేలాదిగా సభ్యులు
- రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ వినూత్న ప్రయోగానికి స్పందన



కర్నూలు కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ తెల్లవారుతూనే ఓ కథ, ఓ పొడుపు కథ, ఒక సామెత, ఒక గేయం వంటివి సోషల్ మీడియాలో పెట్టి వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచుతున్నారు కర్నూలుకు చెందిన ప్రముఖ బాలల కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ఆయన ప్రవృత్తి పరంగా వందలాది కథలు రాశారు. అనేక పుస్తకాలు వెలువరించారు. ప్రత్యేకించి పిల్లల్లో తెలుగు భాష, సాహిత్యం పట్ల ఆసక్తి పెరిగేలా ఆయన రచనలు దోహద పడుతున్నాయి. అంతేకాదు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు హరికిషన్ కథలు, సాహిత్యాన్ని తరగతి గదిలో పిల్లలకు పంచుతూ వారిని భాషాభిమానులుగా తీర్చిదిద్దుతున్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల వేదికగా డాక్టర్ హరికిషన్ తన సాహితీ ప్రస్థానాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. ఆయనకు ఒక్క వాట్సాప్‌లోనే 38 గ్రూపుల్లో సాహిత్యాభిలాషులు ఉన్నారు.

కరోనా కల్పించిన వినూత్న ఆలోచన...

కర్నూలుకు చెందిన డాక్టర్ ఎం.హరికిషన్ వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఈయన కోడుమూరు మండలం అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల్లో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు 75 పుస్తకాలు వెలువరించారు. 16 ఏళ్ల క్రితం తొలుత సామాజిక సమస్యలపై కలం ఎక్కుపెట్టి అనేక కథలు రాశారు. రాయలసీమ కథా సాహిత్యాన్ని తెలుగు సాహితీ ప్రియులకు అందించడానికి 'సీమ కథల సంకలనాలు' వెలువరించారు. తర్వాత బాల సాహిత్యంపై దృష్టి పెట్టి అంతరించిపోతున్న జానపద బాల సాహిత్యాన్ని పరిరక్షించడానికి 18 పుస్తకాలు ప్రచురించారు. ఇవన్నీ బాలల్లో ఆసక్తిని కలిగించేలా శ్రద్ధ తీసుకున్నారు. బాలల్లో తెలుగు భాష పట్ల మమకారం పెరిగేలా సంయుక్త అక్షరాలు, ఒత్తులు లేకుండా కథలు, గేయాలు, నవలలు రాశారు. కోవిడ్-19 సమయంలో దేశమంతా ఇళ్లకే పరిమితమైన సమయలో ఆయనకు ఒక కొత్త ఆలోచన తట్టింది. దీంతో 'వంద రోజులు-వంద కథలు' పేరుతో ఆయన వాట్సాప్ వేదికగా ప్రతిరోజూ ఒక కథ, గేయం, పొడుపు కథ, సామెతని వాట్సాప్, ఫేస్‌బుక్ తదితరాల్లో పోస్టు చేసేవారు. వీటిని వీలైనంత మందికి చేరువ చేసేందుకు 32 గ్రూప్‌లను ఏర్పాటు చేశారు. ఒక్క గ్రూప్‌లో ప్రస్తుతం 1014 మందికి అవకాశం లభిస్తోంది. ఇలా ఒక రోజులో సుమారు 58 వేల మందికి ఇవి చేరుతున్నాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ వీటిని ప్రింటు కూడా తీసుకొని పిల్లలకు జెపెగ్(చిత్రం)రూపంలో అందిస్తున్నారు. సామెతల్లో పదాల స్థానంలో బొమ్మలు ఉంచి పిల్లలు నేర్చుకోవడానికి ఆహ్లాదంగా మారుస్తున్నారు. 'చెప్పుకోండి చూద్దాం' పేరుతో బొమ్మలతో పొడుపు కథలు అడుగుతున్నారు. ప్రతి ఆదివారం ఒక సామాజిక సమస్యపై కథ పోస్టు చేస్తున్నారు. అలాగే వాట్సాప్‌లో అందుబాటులో ఉండే బ్రాడ్‌కాస్ట్ గ్రూపుల ద్వారా రెండున్నర వేల మందికి వీటిని చేరువ చేస్తున్నారు. ఈ గ్రూప్‌ను లింక్‌ను కోరుకునేవారు సెల్ నెం. 9441032212కు 'హాయ్' అని పెడితే రచయిత లింక్ అందజేస్తున్నారు.



టెలిగ్రాం మాధ్యమం వేదికగా 'వంద రోజులు-వంద కథలు'


యూట్యూబ్‌లో 'హరి' కథలు....

డాక్టర్ ఎం. హరికిషన్ యూట్యూబ్‌లో 'హరి కథలు' పేరుతో ఒక చానెల్ నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ చానెల్‌లో 200లకు పైగా కథలను చదివి వినిపించారు. ఈ చానెల్‌కు సుమారు 50 వేలకు పైగా సబ్‌స్రైబర్లు ఉన్నారు. ఫేస్‌బుక్‌లో 'హరికిషన్ కర్నూలు' పేరుతో కర్నూలు జిల్లా చరిత్ర, చారిత్రక ప్రదేశాలు, ఆలయాలు, స్వాతంత్ర్య సమరయోధుల వివరాలు పొందుపరిచారు. 'వంద రోజులు-వంద కథలు' శీర్షికలో మధ్యలో చేరేవారి కోసం ప్రత్యేకంగా ఒక టెలిగ్రాం గ్రూపును హరికిషన్ ప్రారంభించారు. ఇందులో ప్రస్తుతం ఐదు వేల మంది చేరారు. ఇన్‌స్టాగ్రామ్‌లోనూ 'హరికిషన్ కర్నూలు' పేరుతో కథలు, గేయాలు, సామెతలు పోస్టు చేస్తున్నారు. అలాగే 'ప్రతి లిపి' అనే అనే తెలుగు సాహిత్య మాధ్యమంలోనూ తన కథలు హరికిషన్ అందుబాటులో ఉంచారు. ఇక ఇంటర్నెట్ ఆర్కైవ్స్‌లో కూడా కథలన్నీ భద్రపరిచారు. హరికిషన్ బాలల గేయాలు, బాలల కథలు అని ఇంటర్నెట్‌లో సెర్చ్ చేస్తే కూడా అవన్నీ లభిస్తాయి. ఇటీవల 'కోరా' అనే మాధ్యమంలోనూ బాలల కథన్ని డాక్టర్ ఎం. హరికిషన్ ప్రచారం చేస్తున్నారు.



యూట్యూబ్ చానెల్‌లో హరికిషన్ జానపద కథలు

భాష, సాహిత్యం ప్రజలకు చేరడమే ముఖ్యం



తెలుగు భాషా, సాహిత్యాలు ప్రజలకు చేరడమే ముఖ్యంగా భావిస్తాను. ఒకప్పుడు పుస్తకాలు చదవడం ఒక్కటే అవకాశంగా ఉండేది. మారుతున్న కాలంలో ఆధునిక విధానాలు సాహిత్యంపై కూడా ప్రభావితం చూపుతున్నాయి. ఈ తరుణంలో సోషల్ మీడియాను వేదికగా చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోవిడ్-19 సమయంలో ప్రారంభించిన సోషల్ మీడియాలో నా ప్రస్థానం ఏడాది తర్వాత ఆపేద్దామని అనుకున్నా. కానీ వీక్షకుల నుంచి వస్తున్న విపరీతమైన ప్రతి స్పందన నాపై బాధ్యతను పెంచింది. అందుకే ప్రతిరోజూ కొంత సమయం కేటాయించుకొని బాలల కోసం నావంతు ప్రయత్నం చేస్తున్నా. తెలుగు భాషపై మమకారం పెరిగి, నా కథలు, గేయాలు, సాహిత్యం విద్యార్థులకు ప్రయోజనకరంగా మారితే అదే నాకు గొప్ప సంతోషం. అదే గొప్ప సంతృప్తి.

- డాక్టర్ ఎం. హరికిషన్, బాల సాహితీవేత్త, కర్నూలు



ఫేస్‌బుక్‌లో 'హరికిషన్ బాలల కథలు'

అధికారులపై చర్యలు తీసుకోండి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సంబంధం లేని అంశాలను అప్‌లోడు చేసిన వెల్దుర్తి ఈవోపీఆర్‌డీపై చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో, డీపీవోను కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. కర్నూలు మున్సిపాలిటీకి సంబంధించిన టౌన్ ప్లానింగ్ విభాగపు అధికారిపై చర్యల తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కొంత మంది అధికారులు వచ్చిన అర్జీకి సరైన ఎండార్స్‌మెంటు ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎండార్స్‌మెంటు, విచారణ నివేదికలను అప్‌లోడు చేయడంపై అధికారులకు సరైన స్పష్టత లేదని, ఈ అంశాలపై జిల్లా అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని అన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులు 20 పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ సరైనవిధంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, నాగప్రసన్నలక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

రాఘవేంద్రుని సన్నిధిలో సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్

మంత్రాలయం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తండ్రి సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ సోమవారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. సాధారణ భక్తుడిలా వచ్చి గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట సూపరింటెండెంట్ అనంతపురాణిక్, బిందు మాధవ్, అనంత స్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, సీపీ స్వామి ఉన్నారు.



శ్రీమఠంలో ప్రదక్షిణలు చేస్తున్న సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్

టెట్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్

150కి 150 మార్కులు సాధించిన క్రాంతి కుమార్



అవుకు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా అవుకు మండలం నిచ్చెనమెట్ల గ్రామానికి చెందిన తలారి క్రాంతికుమార్ సోమవారం విడుదలైన టెట్ ఫలితాల్లో 150-150 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ నిలిచారు. నిచ్చెనమెట్ల గ్రామానికి చెందిన తలారి క్రిష్ణయ్య, భూలక్ష్మీ దంపతులకు మనోజ్‌కుమార్, క్రాంతికుమార్‌లు సంతానం. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారులకు చదువుపై ఉన్న ఆసక్తిని గమనించి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కష్టపడి చదివించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన క్రాంతి కుమార్ 1 నుంచి 5వ తరగతి వరకు నిచ్చెనమెట్ల ప్రాతమిక పాఠశాల, 6 నుంచి 10 వరకు గుండ్లశింగవరం జడ్పీ ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ నంద్యాల నలంద కళాశాలలో పూర్తి చేశాడు. డిగ్రీ బనగానపల్లె ఎస్వీ కళాశాల, టీటీసీ బనగానపల్లె శ్రీలక్ష్మి కళాశాలలో చదువుకున్నారు. కష్టపడి చదివి టెట్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సువర్ణ అవకాశం

టెట్ ఫలితాల్లో కోసిగి అభ్యర్థినికి జిల్లా ఫస్ట్ ర్యాంకు



కోసిగి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అక్షరాస్యతలో చిట్టచివరి నుంచి రెండో స్థానంలో కోసిగి మండలం ఉంది. అలాంటి మండల కేంద్రానికి చెందిన ముకుంద సువర్ణ సోమవారం విడుదలైన టెట్ ఫలితాల్లో 146.89 /150 మార్కులతో రాష్ట్ర స్థాయిలో టాప్ ర్యాంకు సాధించింది. అలాగే కర్నూలు జిల్లాలో మొదటి ర్యాంకు దక్కించుకొని అందరితో శభాష్ అనిపించుకుంది. కోసిగిలోని 7వ వార్డుకు చెందిన ముకుంద కృష్ణమూర్తి, పద్మావతి దంపతుల మొదటి కుమార్తె ముకుంద సువర్ణ 2016లో కోసిగిలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసింది. ఇంటర్ కర్నూలులోని సెయింట్ జోసెఫ్‌లో చదివింది. కోసిగిలోని నారాయణ డిగ్రీ కళాశాలలో డిగ్రీ (బీఎస్సీ), సాయిప్రతిభ కాలేజీలో బీఈడీ పూర్తి చేసింది. ఆ తరువాత 2020లో కర్నూలులోని ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకుని టెట్ ఫలితాల్లో 150 మార్కులకుగాను 146.89 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి టాప్ ర్యాంకుతోపాటు జిల్లా స్థాయి మొదటి ర్యాంకు దక్కించుకుంది. అయితే.. టెట్ పరీక్ష రాసే సమయంలో సువర్ణ తన రెండు నెలల కుమారుడు, తల్లిదండ్రులతో కలిసి కర్నూలులోని పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో టెట్ పరీక్ష రాసింది. కోసిగి మండలం నుంచి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల కోసిగి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీచరు ఉద్యోగం సాధిస్తా

త్వరలో నిర్వహించే డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించి తీరుతా. మా కోసిగి మండలంలో అక్షరాస్యత పెంపొందించేందుకు కృషి చేస్తాను. తల్లిదండ్రులతో పాటు భర్త రామాంజనేయులు సహకారంతోనే టెట్ ఫలితాల్లో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాను. అలాగే కర్నూలులోని ప్రతిభ కోచింగ్ సెంటర్ యాజమాన్యం సహకారంతోనే ఈరోజు ఈ ఫలితం సాధ్యమైంది.

- ఎం.సువర్ణ, కోసిగి



తన రెండు నెలల కుమారుడు, తల్లిదండ్రులతో కలిసి టెట్ పరీక్ష రాసిన జిల్లా ఫస్ట్ ర్యాంకర్ ఎం.సువర్ణ (ఫైల్)

ఎస్పీకి 88 ఫిర్యాదులు

కర్నూలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 88 ఫిర్యాదులు అందాయి. వీటిని ఎస్పీ బిందుమాధవ్ నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఎస్‌బీఐ యోనో బ్యాంకు రివార్డ్ పేరిట వాట్సప్‌లో వచ్చిన లింక్ ద్వారా రూ.47,856 మోసపోయానని కర్నూలు వాసవీనగర్‌కు చెందిన మోహన్ ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా తన తమ్ముళ్లకు అటెండర్, వాచ్‌మెన్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి శారదమ్మ అనే మహిళ రూ.5.50 లక్షలు మోసం చేసిందని కర్నూలు బుధవారపేటకు చెందిన వాణి, పుష్పలత ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పొత్తుకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

(5వ పేజీ తరువాయి)

రాయలసీమ ప్రాజెక్టులకు ఆద్యుడు ఎన్టీఆర్ అని, ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేసిన ఘనత చంద్రబాబుది అని మంత్రి నిమ్మల అన్నారు. అయితే.. ఆ విషయాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతో టీడీపీ కార్యకర్తలు విఫలమయ్యారని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం చేసిందని, వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల జలాశయం నిర్మాణ పనులు, హంద్రీ నీవా పత్తికొండ కుడి ఎడమ కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు అసంపూర్తి పనులు, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, అలగనూరు జలాశయం మరమ్మతు పనులు చేపడుతామన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో మాట్లాడి జిల్లాల్లో రహదారులు అభివృద్ధి చేస్తామన్నారు. వలసల నివారణకు టమోటా ప్రాసెసింగ్‌తో పాటు వివిధ పరిశ్రమలు తీసుకొస్తాం అన్నారు. కప్పట్రాళ్లలో యురేనియం సర్వే కోసం 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చి.. ఇప్పుడు నాటకాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని, వైసీపీ ఎత్తులు తిప్పికొట్టాలని సూచించారు. సాగునీటి సంఘాల ఎన్నికలతో పాటు సహకార ఎన్నికల్లో కూటమి 93 శాతం స్ట్రైకరేట్ అందుకోవాలని సూచించారు. టిడ్కో ఇళ్లకు వైసీపీ ప్రభుత్వం గంపెడు మట్టి కూడా వేయలేదని, ఆ ఇళ్లను తాకట్టు పెట్టి రూ.5 వేలు కోట్లు అప్పు తీసుకుందని పేర్కొన్నారు. త్వరలో లబ్ధిదారులకు ఇళ్లు ఇస్తామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ మంత్రాలయంలో ఇసుక ఉందని, ఎవరైనా ఇసుక రౌడీ మాముళ్లు అడిగితే తనకు ఫోన్ చేస్తే చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏ నియోజకవర్గంలోనైనా కూటమి నాయకుల మధ్య సమస్యలు తలెత్తితే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. బీజేపీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, జనసేన అధ్యక్షుడు చింతా సురేశ్‌బాబు మాట్లాడారు.

వలసలు ఆపేందుకు పరిశ్రమలు

- మంత్రి టీజీ భరత్:

జిల్లాలో ఏటా 2.50 లక్షల మంది వలసలు వెళ్తున్నారని, వలసలు ఆపేందుకు జిల్లాలో పరిశ్రమలు తీసుకొస్తామని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సూపర్ సిక్స్ అమలు చేసి తీరుతామని, దేశంలో 26 రాష్ట్రాల కంటే అత్యధిక పింఛన్ ఇస్తున్నది మన రాష్ట్రమే అని, ఆ ఘనత చంద్రబాబుదే అన్నారు. చిన్నచిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకొని ముందుకు వెళ్దామని పిలుపు ఇచ్చారు. టీడీపీ ఓటమి కోసం పని చేసిన వాళ్లు షెల్టర్ కోసం జనసేన, బీజేపీలోకి వెళ్తున్నారని.. అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని టీజీ భరత్ సూచించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, కర్నూలు-బళ్లారి రోడ్డు జాతీయ రహదారిగా మార్చాలని కోరారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పొత్తును విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ కరువు సీమకు సాగునీరు ఇవ్వాలని కోరారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ఏ పల్లెకు వెళ్లినా గుండ్రేవుల ప్రాజెక్టు అడుగుతున్నారని తక్షణమే చేపట్టాలని కోరారు. బీజేపీ సీనియర్ నాయకుడు పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి స్వగ్రామం రాంపురంలోకి ఏ పార్టీ నాయకులనూ రానివ్వడం లేదని, అక్కడ అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, ఆ ఊరు పాకిస్తాన్‌లో ఉందా..? అంటూ నిలదీశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కూటమి నాయకుల సమష్టి కృషి వల్లే విజయం సాధించామని, అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తి చేయాలని అన్నారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో టీడీపీ ఎంత షేర్ అడుతున్నారో.. మిగిలిన నియోజకవర్గాల్లో బీజేపీ, జనసేనకు అంతే షేర్ ఇస్తున్నారా..? అక్కడ వదిలేసి ఆదోని గురించి ఒక్కటే అడగడం భావ్యమా? అని పేర్కొన్నారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మాట్లాడుతూ ఆదోని రాజకీయ పరిస్థితి మంత్రులకు తెలుసని, వారే పరిష్కరించాలని అన్నారు. ఆరేకల్లు మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల, షాదీఖానాలపై దృష్టి పెట్టాలన్నారు. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప మాట్లాడుతూ మూడు పార్టీల మధ్య సమన్వయం సాధించాలని, కార్యకర్తలకు అన్యాయం చేయవద్దని, ఈ విషయం పెద్దలు సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ మాట్లాడుతూ వేదవతి ప్రాజెక్టుకు ఫేజ్-1 కింద రూ.200 కోట్లు ఇవ్వాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి, కర్నూలు, మంత్రాలయం జనసేన ఇన్‌చార్జిలు హర్షద్, లక్ష్మన్న మాట్లాడారు.



చర్చించుకుంటున్న మంత్రులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

యురేనియంపై ఆందోళన వద్దు

- ప్రజలకు నష్టం కలిగే పనులు చేయం
- జలవనరుల శాఖకు పూర్వ వైభవం తీసుకువస్తాం
- ఉచిత ఇసుక విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయండి
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
- డీఆర్సీ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు





సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'మాది ప్రజా ప్రభుత్వం. ప్రజలకు నష్టం చేకూర్చే పనులు ఏ ఒక్కటీ చేసేది లేదు. యురేనియం తవ్వకాలకు సంబంధించి ఆందోళన చెందకండి..' అని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు భరోసానిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా అభివృద్ధి సమీక్ష మండలి సమావేశం జరిగింది. వ్యవసాయం, ఉద్యానం, నీటి పారుదల, సాగునీరు, ఇసుక, వైద్యం, ఆరోగ్యం తదితర అంశాలపై మంత్రి అధికారులతో సమీక్షించారు.

మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశామన్నారు. గత పాలనకు భిన్నంగా ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే 200 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి పేదవాని కడుపు నింపుతున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణమైతే భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కరువ రహిత రాష్ట్రంగా అవుతుందని తెలిపారు. 2022లో గత ప్రభుత్వం యురేనియం తవ్వకాలకు సంబంధించి సర్వేకి అనుమతి ఇచ్చిందని మంత్రి తెలిపారు. వచ్చే సంవత్సర కాలంలో హంద్రీనీవా మీద రూ.2800 కోట్లు ఖర్చు పెట్టి హంద్రీనీవా ద్వారా ప్రస్తుతం వస్తున్న 1800 క్యూసెక్కుల నీటి నుంచి 3,850 క్యూసెక్కులకు నీరు వచ్చే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

> రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ పశుసంవర్ధక, మార్కెటింగ్, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించి పథకాల గురించి సోషల్ మీడియాలో, సిటి కేబుల్ చానల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

- ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి వాల్మీకి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద పత్తి మార్కెట్ యార్డు ఆదోనిలో ఉందన్నారు. వర్షం పడితే తగినన్ని షెడ్లు లేక వేరుశనగ బుడ్డలు కొట్టుకుపోతున్నాయన్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేదని, వర్షం వల్ల తడిసిన పంటలను ఆరబెట్టుకోవడానికి తగిన షెడ్లు లేవని మార్కెట్ యార్డులో రైతులు విశ్రాంతి తీసుకోవడం కోసం ఉన్న భవనం గత ఏడు సంవత్సరాలుగా మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల మూత పడిందన్నారు.
- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డును విశాఖపట్నంకు తరలించవద్దని, కర్నూలులోనే బోర్డు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. కర్నూలు మార్కెట్ యార్డులో నిర్మాణంలో ఉన్న కోల్డ్ స్టోరేజీ ప్లాంటు పనులు ఆగిపోయాయనీ, 30 శాతం పనులు మాత్రమే మిగిలిపోయాయనీ మిగిలిన పనులు చేయడానికి రూ.4 కోట్లు విడుదల చేసినట్లయితే మిర్చి పంటను కోల్డ్ స్టోరేజీలో ఉంచి కాపాడుకోవచ్చని తెలిపారు. జిల్లాలో మొత్తం నీటి నిల్వలు 6 టీఎంసీలు మాత్రమే ఉందని, ఇది జిల్లాకు ఏ మాత్రం సరిపోదని, 80 టీఎంసీల శ్రీశైలం నీటిని పశ్చిమ ప్రాంతానికి ఇవ్వాలని కోరారు. గుండ్రేవుల ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి వలసలు నివారించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరారు.
- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం కాపాడే లైవ్‌స్టాక్ వ్యాక్సిన్ యూనిట్ ఇప్పటికీ హైదరాబాదులో ఉండిపోయిందని, లైవ్ స్టాక్ యూనిట్ బనవాసిలో ఉండాలని కోరారు. గాజులదిన్నె ప్రాజెక్టు సంబంధించి 110వ కిలోమీటర్ల స్లూయిస్ దగ్గర హంద్రీనది నీరు కలుస్తుందని, వాటర్ డిమాండ్‌ను పెంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు నీరు వచ్చేలా చేయాలని సూచించారు.
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లా అంటేనే కరువు జిల్లాగా పేరు పొందిందన్నారు. కర్నూలు పట్టణానికి తాగునీరు, రైతులకు సాగునీరు ఇబ్బంది లేకుండా ఉండాలంటే తప్పనిసరిగా గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి పాణ్యం నియోజకవర్గంలో 16 వార్డులు ఉన్నాయని, సుమారు 4 నుంచి 5 రోజులకు ఒకసారి తాగునీరు వస్తుందన్నారు. ఐఐఐటీ కళాశాలకు రూ.22 కోట్లు మంజూరు చేయడం జరిగిందని ఫిల్టర్ బెడ్స్ కోసం మునగాలపాడు వద్ద ఒకటిన్నర ఎకరా భూసేకరణ చేయాలని, సంపు కోసం అర్ధ ఎకరా కావాలని కోరారు.

> పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ 2014-19 కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం రూ.260 కోట్లు ఖర్చు పెట్టి చెరువులు నింపే కార్యక్రమానికి పనులు మొదలు పెట్టగా.. గత వైసీపీ ప్రభుత్వం ఏమీ చేయకుండా వదిలేసిందని తెలిపారు. ప్రస్తుతం ఆ పైపులు లీకేజీ అయి పొలాలు చెడిపోతున్నాయనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారనీ తెలిపారు. పైపులైన్ ఆపరేషన్ మెయింటెనెన్స్ మంజూరు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎస్పీ బిందుమాధవ్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, స్టేట్ సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, టూరిజం డైరెక్టర్ ముంతాజ్, విజయ డెయిరీ చైర్మన్ ఎస్‌వీ జగన్మోహన్ రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

> కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ఆదోని మార్కెట్ యార్డు డ్రైనేజీల నిర్మాణంలో ఆదోని మార్కెట్ యార్డు అధికారులతో సమీక్ష నిర్వహించి నిధుల మంజూరుకు డీవో లెటర్ పంపాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుచ్చకాయలమడ గ్రామంలో పర్యటించిన సమయంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ నుంచి గ్రావిటి రూపంలో నీటిని అందించేందుకు ఎస్టిమేట్లు తయారు చేసి పంపించామన్నారు. వాటి ద్వారా 5వేల ఎకరాలకు 40 నుంచి 50 గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుందని కలెక్టర్ మంత్రి దృష్టికి తీసుకుని రాగా, వెంటనే అందుకు సంబంధించిన ప్రతిపాదనల కాపీని పంపించాలని మంత్రి సూచించారు. సుంకేసుల డ్యాం నుంచి కిందకు 12 కి.మీల వరకు అక్రమంగా ఇసుక తవ్వకుండా చూడాలని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి కోరగా.. అక్కడ తనిఖీలు చేయాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కర్నూలు ఆర్డీవోను ఆదేశించారు.

పుట్టగొడుగుల్లా వెంచర్లు

- ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే విక్రయాలు
- నష్టపోతున్న కొనుగోలుదారులు
- జాతీయ రహదారి పక్కనే దందా
- విచారణ చేపట్టిన అధికారులు



గోనెగండ్లలో పంచాయతీ అనుమతి లేకుండా వేసిన వెంచర్

గోనెగండ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోనెగండలో రియల్టర్లు రెచ్చిపోతున్నారు. తమ ఇష్టానుసారం వెంచర్లు వేసి అమ్మకాలు జరుపుకుంటున్నారు. గోనెగండ్ల జాతీయ రహదారి పక్కన ఎకరం పొలం రూ. కోటి దాకా ధర పలుకుతున్నది. పొలం యజమానుల మధ్య పోటీ పెట్టి భూముల ధరలను రియల్టర్లు ఇస్టానుసారంగా పెంచుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న పంట భూములను రైతు దగ్గర నుంచి కొని రెవెన్యూ, పంచాయతీ అనుమతులు లేకుండా ప్లాట్‌లను వేసి అమ్ముకుంటున్నారు.

పల్లెలకు సైతం..

ఈ వ్యాపారం పట్టణాల నుంచి మండల కేంద్రాలకు, అక్కడి నుంచి పల్లెలకు పాకుతున్నది. మండలంలోని పలు గ్రామాల్లో ఈ రకంగా అక్రమంగా ప్లాట్లులు వేసి అమ్మకాలు జరుపుతున్నారు. కొందరు అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నా రనే విమర్శలు కూడా ఉన్నాయి.

పంచాయతీ అధికారులకు ఫిర్యాదు..

గోనెగండ్లలో జాతీయ రాహదారి పక్కనే 554/ఏ అనే సర్వేనెంబర్‌లో 43 సెట్ల భూమిలో ప్లాట్లు వేశారు. అయితే పంట భూములను కొందరు రియల్టర్‌లు ప్లాట్ వేస్తున్నారు. వ్యవసా యభూమిని నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా మార్చకుండా విక్రయి స్తున్నారని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సోమవారం పంచాయతీ అధికారులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు అక్రమ లే అవుట్ వేసిన భూమిలోని సర్వే నెంబర్ రాళ్లను తొలగించారు. తహసీల్దార్ సైతం పనులు నిలిపివేయాలని వీఆర్వోను పంపించినట్లు తెలిపారు.

ఈ నిబంధనలు తప్పని సరి

వ్యవసాయభూమిని ప్లాట్‌గా మార్చి అమ్మాలంటే ముందుగా ఆర్‌డీవో నుంచి ల్యాండ్ కన్వర్షన్ చేయాలి. అంత కంటే ముందు అగ్రికల్చర్ ల్యాండ్‌ను నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా కన్వర్షన్ చేయించాలి. అనంతరం పంచాయతీ నుంచి లేఅవుట్ అప్రూవల్ చేయించాలి. అప్పుడు పంచాయతీ అధికారులు ఎల్‌సీ నెంబర్ కేటాయిస్తారు. అనంతరం 'కుడా' పర్మిషన్ పొందిన తరువాత నిబంధనల ప్రకారం పార్క్, రోడ్డు స్థలాలు కేటాయించాలి. అయితే ఈ నిబంధనలను పాటించకుండా ప్లాట్ వేసి అమ్మకాలు జరుపుతున్నారు.

అక్రమ లే అవుట్లు వేస్తే చర్యలు తప్పవు



గోనెగండ్లలో పంచాయతీ అనుమతి లేకుండా నిబంధనలు పాటించకుండా లే అవుట్లు వేస్తే సహించేది లేదు. ప్రస్తుతం పంచాయతీ అనుమతి లేకుండా గ్రామంలో 554/ఏలో లే అవుట్ వేశారు. వారికి నోటీస్‌లు కూడా అందజేశాం.

- సతీష్, పంచాయతీ కార్యదర్శి గోనెగండ్ల.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 84 ఫిర్యాదులు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 84 ఫిర్యాదులు అందాయి. వాటిని స్వయంగా స్వీకరించిన ఎస్పీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. వికలాంగు లు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పోలీసు సబ్ డివిజన్లతోపాటు సర్కిల్, పోలీసు స్టేషన్లలో కూడా నిర్వహి స్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రజలు వ్యయ ప్రయాసలకోర్చి నంద్యాలకు రాకుం డా వారికి సమీపంలోని పోలీసు స్టేషన్లలో కూడా ఫిర్యాదులు సమర్పించవచ్చని ఎస్పీ సూచించారు.. ఏఎస్పీ యుగంధర్‌బాబు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే ఉపేక్షించం

- దళారుల పట్ల అప్రమత్తంగా ఉండండి
- మార్కెట్ అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం



ఉల్లిగడ్డల రైతుతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కర్నూలు అగ్రికల్చర్/అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో దళారుల పట్ల అప్రమత్తంగా ఉండండి.. రైతులను మోసం చేస్తే ఉపేక్షించేది లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. జిల్లా మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలసి కర్నూలు వ్యవసాయ మార్కెట్‌ను సోమవారం సందర్శించారు. మార్కెట్‌లో నడుస్తూ ఉల్లి సహా ఇతర పంటలు అమ్మకానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. పత్తికొండ మండలం మారెల్ల గ్రామానికి చెందిన రైతు లాలప్ప, కల్లూరు మండలం బస్తిపాడు గ్రామానికి చెందిన రైతు మునిస్వామి, దేవనకొండ మండలం ఐరన్‌బండ గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులతో మంత్రులు మాట్లాడారు. ఉల్లి దిగుబడులు, ధర, మార్కెట్‌లో సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. పంట దిగుబడి పెరిగిందని, గతంలో పోలిస్తే ధర ఆశాజనకంగా ఉందని రైతులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ గత ఏడాది వైసీపీ ప్రభుత్వంలో అక్టోబరు నెలలో 51 వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వస్తే క్వింటా ధర సగటున రూ.2 వేలు కూడా పలకలేదని, ఈ ఏడాది అక్టోబరులో 1.51 లక్షల బస్తాలు దిగుబడి వచ్చిందని, సగటు ధర రూ.3,500 వరకు వచ్చిందని వివరించారు.

ఇ-నామ్ సర్వర్ సమస్య వల్ల కొంత ఇబ్బంది వస్తే.. మ్యానువల్‌గా కొనుగోలు చేయమని ఆదేశించామని తెలిపారు. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై ధర తగ్గించే అవకాశం ఉందని, అలాంటి వారిపై నిఘా ఉంచాలని మార్కెట్ సెక్రెటరీ విజయలక్ష్మిని ఆదేశించారు. మంత్రులతో పాటు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తదితరులు ఉన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని నాయకులకు ఆదేశించారు.

ఎరువుల కొరత లేదు



మార్క్‌ఫెడ్ చైర్మన్‌ను సన్మానిస్తున్న అధికారులు

- గ్రామాల్లో అన్ని ఎరువులు రైతులకు అందుబాటులో
- మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగారు రాజు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో అవసరమైన అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామని, వ్యాపారులు దళారులు యూరియా, డీఏపీ తదితర కాంప్లెక్స్ ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు రైతులకు అంటగడుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ యంత్రాంగానికి విజ్ఞప్తి చేసినట్లు మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ బంగారు రాజు తెలిపారు. అమరావతి నుంచి సోమవారం కర్నూలు, నంద్యాల జిల్లాల పర్యటన చేసిన మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్నూలులోని మార్క్‌ఫెడ్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్నూలు, నంద్యాల జిల్లాల మేనేజర్లు రాజు, సురేష్ ఆయనను సన్మానించారు. చైర్మన్ విలేకరులతో మాట్లాడుతూ ఎరువులను గ్రామాల్లోని రైతులందరికీ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఎంఆర్‌పీ ధరకే అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఎక్కడైనా అక్రమాలు జరుగుతుంటే.. మార్క్‌ఫెడ్ మేనేజర్లకు ఫిర్యాదు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు పండించిన పంట ఉత్పత్తులకు మద్దతు ధర అందకున్నా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ఆనాటి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తాము కేంద్రం, రాష్ట్రం ప్రకటించిన మద్దతు ధరలు అందకుంటే వెంటనే రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, మార్క్‌ఫెడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు



నిందితుడిని మీడియాకు చూపుతున్న సీఐ

పాణ్యం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితుడ్ని సోమవారం గడివేముల బస్టాండు సమీపంలో అరెస్టు చేసినట్లు పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన వడ్డె సుబ్బరాయుడు నంద్యాల పట్టణం హనీఫ్ నగర్‌లో నివాసముంటున్నాడన్నారు. నిందితుడు 1997 నుంచి దొంగతనాలకు అలవాటు పడినట్లు తెలిపారు. రాత్రివేళల్లో దొంగతనాలు చేస్తూ దోచుకున్న నగదు, బంగారు నగలను అమ్మి విలాసాలకు ఖర్చు చేసుకుంటున్నట్లు తెలిపారు. 2023లో గడివేముల పోలీసు స్టేషన్‌లో హత్యాయత్నం, దొంగతనం కేసు నమోదైనట్లు తెలిపారు. ఈమేరకు నిందితుడ్ని రిమాండ్‌కు తరలించామన్నారు.

జలాశయంలో గుర్తు తెలియని మృతదేహం

వెలుగోడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు జలాశయంలో సోమవారం ఓ గుర్తు తెలియని యువకుడి శవం లభ్యమైనట్లు ఎస్ఐ విష్ణునారాయణ తెలిపారు. సుమారు 40 సంవత్సరాలలోపు వయస్సు ఉంటుందని అన్నారు. శవం తేలాడుతున్నట్లు సమాచారం రావడంతో బయటకు తీశామని చెప్పారు. ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పోలీసుల అదుపులో వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి

మహానంది, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం ఇ. బొల్లవరం గ్రామానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి తిరుమల కృష్ణను ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కర్నూలుకు చెందిన సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తిరుమల కృష్ణపై గతంలో కర్నూలు 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే అక్కడి సీసీ పోలీసులు తిరుమల కృష్ణను గ్రామంలోని ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని కర్నూలుకు తరలించినట్లు సమాచారం. మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డిని వివరణ కోరగా వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి తిరుమల కృష్ణను సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకొన్న విషయంపై తమకు సమాచారం లేదన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోడుమూరు రహదారిలో కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎర్రిస్వామి (30)చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎర్రిస్వామి గౌండా పని చేస్తుంటాడు. ఆదివారం ఉదయం పనికి వెళ్లి రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్తున్నాడు. కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాలు వద్ద ఓ ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఎర్రిస్వామి తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

టీడీపీ సభ్యత్వంతో ప్రయోజనాలు : ఎమ్మెల్యే


టీడీపీ సభ్యత్వాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి తదితరులు

కర్నూలు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో అనేక ప్రయోజనాలు పొందవచ్చునని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కార్యకర్తలకు సూచించారు. కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం గ్రామంలో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్దన్ రెడ్డి, మాజీ సర్పంచు కౌలుట్లయ్య, స్థానిక నాయకులు షాధిక్ బేగ్, సోఫీబేగ్, సురేష్ పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన కాల్వబుగ్గ


కాల్వబుగ్గలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

ఓర్వకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో భక్తులు ఆలయానికి చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, కల్లె మనోహర్ శర్మలు శివునికి పూజలు చేశారు. శివపార్వతులను పల్లకిలో ఉంచి ఆలయం చుట్టూ ఊరేగించారు. హుశేనాపురం గ్రామానికి చెందిన కాటినేని నారాయణ ఆధ్వర్యంలో ఆలయంలో పుష్పగుచ్ఛ అలంకరణ చేయించారు. ఆలయ ఈవో మద్దిలేటి, తహసీల్దార్ విద్యాసాగర్, గ్రీన్‌కో ఎండీ శ్రీనివాసరావు, జిల్లా ఎస్పీ బిందుమాధవ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.



భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

కర్నూలు కల్చరల్: కార్తీక తొలి సోమవారం సందర్భంగా నగరంలోని వివిధ దేవాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయంత్రం మహిళలు ఆలయాల్లో దీపాలు వెలిగించారు. నగరంలోని కేసీ కెనాల్ సమీపంలోని రమా సమేత సత్యనారాయణ స్వామి, సప్తగిరి నగర్‌లోని అయ్యప్ప ఆలయాలు, పాత నగరంలోని శివాలయం, సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రం, అశోక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి, మల్లికార్జున స్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

కల్లూరు: నగరంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం భక్తులు పూజలు చేశారు. గౌరీ శంకర స్వామికి ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహాశర్మ స్వామివారికి రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ట్రస్టీ టి.శివరామకృష్ణ ఆధ్వ ర్యంలో భక్తులను ప్రసాదాల వితరణ చేశారు.


కర్నూలు నగరంలోని అయ్యప్ప స్వామి గుడి వద్ద శివాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు



టెట్ ఫలితాల్లో ప్రతిభ విద్యార్థుల సత్తా


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో డైరెక్టర్ అరుణాచలంరెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 4(ఆంధ్ర జ్యోతి): ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్ష ఫలితాల్లో కర్నూలు ప్రతిభ కోచింగ్ సెంటర్ విద్యార్థులు రాణించారు. ఎం.సువర్ణ (146.89 /150 మార్కులు), సబా అంజుమ్ (142.63), లక్ష్మీశ్వరి (142.3), ఎం.సోమశేఖర్ (141.53) ఉత్తమ మార్కు లతోపాటు 138.75, 138.69, 138.32, 138.11, 137.92, 137.76, 137.23 మార్కులు సాధించారు. ఈ మార్కులు, ర్యాంకులు సాధించడానికి అధ్యాపకుల కృషి ఉందని ప్రతిభ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ అరుణాచలంరెడ్డి తెలిపారు.

మధుసూదన్ రెడ్డికి డాక్టరేట్


మధుసూదన్ రెడ్డి

కర్నూలు కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర శివారు దూపాడు లోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల్లో ట్రిపుల్ ఈ బ్రాంచ్ హెచ్ఓడీ ఎం.మధుసూదన్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. విజయ వాడలోని కేఎల్ యూనివర్సిటీ నుంచి ఆయన డాక్టరేట్ అందుకున్నారు. 'పవర్ క్వాలిటీ అగ్మెంటేషన్ ఆఫ్ షింట్ యాక్టివ్ పవర్ ఫిల్టర్ బేస్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ యూసింగ్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్' అనే అంశంపై ఆయన పరిశోధన గ్రంథం యూనివర్సిటీకి సమర్పించారు. ఎలక్ట్రిసిటీ విభాగానికి ఉపయోగపడే ఈ పరిశోధన గ్రంథానికి గాను కేఎల్ యూని వర్సిటీ మధుసూదన్ రెడ్డికి డాక్టరేట్ అందజేసింది. మధుసూదన్ రెడ్డిని కళాశాల ఛైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ ఎస్ విజయలక్ష్మమ్మ, వివిధ విభాగాల హెచ్ఓడీలు, ఫ్యాకల్టీలు అభినందించారు.

హంద్రీ కాలువకు నిధులు కేటాయించాలి

● మంత్రి నిమ్మల రామానాయుడుకు సీపీఎం నాయకుల వినతి

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 4(ఆంధ్ర జ్యోతి): హంద్రీ కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులు పెంచడానికి అవసరమైన నిదులు కేటా యించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు సీపీఎం నాయకులు కోరారు. సోమవారం జిల్లాకు వచ్చిన మంత్రిని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కే.ప్రభాకర్‌రెడ్డి, వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్‌లు కలిపి వినతిపత్రం అందజేశారు.

'ఉల్లి రైతులకు న్యాయం చేయాలి'

కర్నూలు అగ్రికల్చర్: కర్నూలు మార్కెట్ యార్డులోని ఉల్లి రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మంత్రి నిమ్మల రామానాయుడుకు కోరారు. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డులో మంత్రులు నిమ్మల రామానాయుడు, టీజీ భరత్ పర్యటించారు. ఈసందర్భంగా రైతు సంఘాల ప్రతినిధులు మంత్రికి వినతి పత్రం అందజేశారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోలు చేస్తామని 30 మంది వ్యాపారులకు లైసెన్సులు ఇచ్చారని, అయితే.. వారు సిండికేట్‌గా మారి కేవలం ఐదుగురు వ్యాపారులు మాత్రమే రైతుల నుంచి ఉల్లిని కొనుగోలు చేసి అందరూ వ్యాపారులు పంచుకుని ఎగుమతి చేస్తున్నట్లు మంత్రికి రామకృష్ణ వివరించారు.

ఎస్టీ రిజర్వేషన్‌ను పునరుద్ధరించండి

కర్నూలు కలెక్టరేట్: వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని కోరుతూ సంఘం నాయకులు సోమవారం కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేశారు. వాల్మీకి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ నాయుడు, రమణ, శేఖర్, కృష్ణుడు, రవి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌పై మంత్రికి ఫిర్యాదు

కర్నూలు అర్బన్: రాయలసీమ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని భీమ్ ఆర్మీ రాష్ట్ర కన్వీనర్ ఎస్ విజయ భాస్కర్ కోరారు. సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టీకే నాయక్ వర్సిటీకి సంబంధించి రూ.150 కోట్లు స్వాహా చేశారని, వాటికి సంబంధించిన వివరాలను మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి వెంటనే విచారణకు ఆదేశించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నష్ట పరిహారం ఇవ్వాలి

ఓర్వకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జైరాజ్ ఇస్పాత్ స్టీల్‌ప్లాంటులో ఓపెన్ బ్లాస్టింగ్‌తో దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ నాయకులు ప్రజా సమస్యల పరిష్కర వేదికలో తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ మండలంలోని గుట్టపాడు గ్రామంలో జైరాజ్ స్టీల్ ప్లాంటు ఓపెన్ బ్లాస్టింగ్‌తో వంద ఇళ్లు దెబ్బతినడమే కాకుండా బీటలు వారాయని అన్నారు. ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు మహబూబ్ బాషా, రైతులు సుంకన్న, అయ్యస్వా ములు, మహ్మద్ మియా పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి తక్షణ పరిష్కారం చూపుతామని తహసీల్దార్ రామాంజనే యులు అన్నారు. సోమవారం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ రామాంజనేయులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

స్కేటింగ్‌లో పతకాలు సాధించాలి

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటల్లో పతకాలు సాధించాలని ఎ.క్యాంపు మాంటిస్సోరి ప్రిన్సిపాల్ రమాజ్యోతి అన్నారు. ఇటీవల కర్నూలు స్టేడియంలోని స్కేటింగ్ రింక్‌లో జరిగిన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలకు చెందిన విద్యార్థులు మాన్విశ్రీ, హితాక్ష్, శామ్యూల్ రెనాల్డ్‌లు జిల్లా స్థాయిలో బంగారు, వెండి పత కాలు సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపాల్ రమాజ్యోతి వారిని అభినందించారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు కాకినాడలో ఇండోర్ స్కేటింగ్ రింక్‌లో జరిగే 36వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అభినందించిన వారిలో స్కేటింగ్ జిల్లా సీఈవో పి.సునీల్ కుమార్, పీఈటీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనధికార దుకాణాలను తొలగించాలి

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గాయత్రి ఎస్టేట్‌లోని రహదారులపై అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, తక్షణమే వాటిని తొలగించాలని స్థానికులు కోరారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎస్ఈ రాజశేఖర్, ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, ఆర్ఓ జునైద్, మేనేజర్ చిన్నరాముడు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వసతుల కల్పనకు చర్యలు: జగన్నాథ గట్టు వద్ద ఉన్న టిడ్కో గృహాల్లో అవసరమై వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు తెలిపారు. సోమవారం అధికారులతో కలిసి కమిషనర్ టిడ్కో గృహాలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో 255 బ్లాకుల్లో 10,000 వేల గృహాలు ఉన్నాయన్నారు. అందులో నివాసముంటున్న లబ్ధిదారులు, ఖాళీగా ఉన్న గృహాలకు సంబంధించిన వివరాలతోపాటు విద్యుత్, తాగునీటి కనెక్షన్ వంటి వివరాలను సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. టిడ్కో డీఈ గుప్తా, నగర పాలక టిడ్కో స్పెషలిస్టు పెంచలయ్య ఉన్నారు.

సంక్షేమం అమలు బాబుకే సాధ్యం

ఆదోని టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు సీఎం చంద్రబాబుకే సాధ్యమని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహమ్మద్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ పథకాల అమలుకు వలంటీర్లపై ఆధారపడ్డ గత సీఎం జగన్‌కు చంద్రబాబు సమాధానం ఇచ్చారని, ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేసి సత్తా చాటుకున్నారన్నారు.

టీటీడీ సభ్యుడికి సన్మానం

ఆలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా ఎంపికైన మల్లెల రాజశేఖర్‌ను టీడీపీ నాయకులు సన్మానించారు. ఈమేరకు సోమవారం కర్నూలులో చిప్పగిరి మాజీ జడ్పీటీసీ ఏరూరు మీనాక్షి నాయుడు, టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి మణేకుర్తి రాజశేఖర్‌ను కలిశారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమించారు


డీటీకి వినతిపత్రం ఇస్తూ..

మద్దికెర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వందుల కుంటలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమించారని మాజీ ఎంపీటీసీ కృష్ణ, పవన్ కుమార్ అన్నారు. సోమవారం డీటీ యువరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. 340 సర్వే నెంబరులో స్థలాలను ఆక్రమిం చారని చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన డీటీ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

ఆక్రమణలపై నోటీసులు జారీ

మద్దికెర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మెయిన్ బజారు పంచాయతీ తీ స్థలాలు ఆక్రమించినవారికి పంచాయతీ కార్యదర్శి శివకుమార్ సోమవారం నోటీసులు జారీ చేశారు. సర్పంచ్ బండారు సుహాసిని ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చామని, కిందరు కాలువలు పూడ్చి కట్టడాలు నిర్మించడంతో మురుగు ముందుకు వెళ్లడం లేదన్నారు. అలాగే ఆక్రమణలను కూల్చివేస్తామని హెచ్చరించారు. గదులు అద్దెకు తీసుకున్నవారు సక్రమంగా అద్దె చెల్లించాలని, లేకుంటే తాళాలు వేస్తామన్నారు. సలహాదారులు బండారు ఆంజనేయులు ఉన్నారు.

దరఖాస్తుల పరిశీలన

మద్దికెర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎం.అగ్రహారం, బురుజుల, హంపా గ్రామాల రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని తహసీల్దార్ హుశేన్ సాహేబ్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ 580 దరఖాస్తులు వచ్చాయని, రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. డీటీ శ్రీదేవి, యువ రాజు ఉన్నారు.

'సభ్యత్వ నమోదుకు స్పందన'


సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఉమాపతి నాయుడు

ఆదోని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుకు భారీ స్పందన వస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు అన్నారు. సోమవారం నెట్టేకల్లు, చిన్న పెండెకల్లు, మండగిరి గ్రామ పంచాయతీలలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. సభ్యత్వం ఉంటే రూ.5లక్షలు ఉన్నట్లే అని అన్నారు. కార్యకర్తలంతా రికారు స్థాయిలో సభ్యత్వం అయ్యేలా చూడాలని పిలుపునిచారు.

బిల్లేకల్లు ఏఎన్‌ఎంపై చర్య తీసుకోవాలి

ఆస్పరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లేకల్లు గ్రామం ఏఎన్ఎం వరాలమ్మపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ డిమాడ్ చేశారు. సోమవారం పీహెచ్‌సీ వద్ద ధర్నా నిర్వహించారు. ఏఎన్ఎం అందుబాటులో లేదని, చిన్న పిల్లలు, బాలింతలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రజలు విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని ఏఎన్ఎం దృష్టికి తీసుకువెళ్తే సమాధానం ఇవ్వకుండా మీటింగుల పేరుతో ఆరోగ్య కేంద్రానికి రావడంలేదని ఆరోపించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రఘురాం రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. దస్తగిరి ఇస్మాయిల్, ఈశ్వర్, షఫీ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి


సీసీ రోడ్లను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ శేషయ్య

తుగ్గలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని పీఆర్ డీఈ శేషయ్య సూచించారు. సోమవారం బొందిమడుగుల గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ముందుగా నేలను చదును చేసి, గ్రావెల్ వేసి కొలత ప్రకారం రోడ్డు వేయాలని, ఇసుక సిమెంటు కంకర సరిపడే వేయాలని లేనిపక్షంలో బిల్లులు చెల్లించమని హెచ్చరించారు. సర్పంచ్ చౌడప్ప, టీడీపీ నాయకులు ప్రతాప్ యాదవ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శంకర్ తదితరులు ఉన్నారు.

మలుపు.. మృత్యు పిలుపు

- తుగ్గలి మండలం మదనంతపురం క్రాస్ వద్ద తరచూ ప్రమాదాలు
- ప్రాణాలు తీస్తున్న రహదారి


ప్రమాదాలకు కారణమైన మదనంతపురం క్రాస్ మలుపు


మలుపులో బోల్తా పడ్డ లారీ (ఫైల్)

తుగ్గలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంతపురం క్రాస్ నుంచి జొన్నగిరి గ్రామాల రహదారిపై మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలోనే బెంగుళూరు, మంత్రాలయం, రాయచూరు, గుత్తి, పత్తికొండ, కడప తదితర ప్రాంతాలకు వాహనాలు వెళ తుంటాయి. రోజుకు పదివేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే భారీగా ట్రాఫిక్ జామ్ అవతోంది.

హడలిపోతున్న ప్రయాణికులు

ఈ రోడ్డుపైనే స్థానికులు, రైతులు, వజ్రాన్వేషకులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే తరచూ ఇక్కడ ప్రమాదలు చోటుచేసుకుంటుండటంతో ప్రయాణికులు హడలిపోతున్నారు. రహదారిపై జొన్నగిరి, మదనంతపురం క్రాస్ వద్ద మలుపులో ఎన్నో ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడ్డారు. ప్రమాదం జరిగినప్పుడు భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది.

ప్రమాద సూచికలు లేవు..

రహదారిపై హెచ్చరిక, ప్రమాద బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు వాటిని పట్టించుకోలేదు. దీతో నిత్యం ఎందరో ప్రాణాలు కోల్పోతుంన్నారు. పైగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మలుపు వద్ద మోకాల్లోతు గుంత పడింది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉంది. ఐదు నెలల్లోనే పది ప్రమాదాలకు పైగా జరిగాయి.

- ఈ ఏడాది మార్చి 14న కర్ణాటక యువకుడు కార్తిక్ మంత్రాలయానికి వెళ్లి వస్తుండగా ఈ మలుపు వద్ద లారీని ఢీకొని మృతి చెందాడు..
- అనంతపురానికి చెందిన సాయికుమార్ అనే యువకుడు గుత్తి వైపు వెళుతూ లారీ ఢీకొని కాలు విరిగి, తీవ్రగాయాలపాలయ్యాడు.
- ఆగస్టు 27న పత్తికొండ నుంచి గుత్తికి వెళ్తున్న భారీ ఐదే అదుపు తప్పి బోల్తా పడి ఎద్దులబండి మీద పడింది.

అధికారులు స్పందించి మలుపు వద్ద గుంతలు పూడ్చడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

మలుపు వద్ద భయం



మలుపువద్దకు వెళ్లాలంటే భయమే స్తుంది. మలుపు వద్ద ఎన్నో ప్రమా దాలు జరిగినా అధికారులు పట్టించుకోకపో వడం బాదా కరం. ఇప్పటికైనా స్పందించి సూచికబోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలి. **- లక్ష్మణస్వామి, జొన్నగిరి.**

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం

మలుపు వద్ద హెచ్చర్రిక బోర్డులు ఏర్పాటు చేసి, . రహదారికి మరమ్మతులు చేసి, గుంతలను పూడ్చుతాం. **- శివరుద్ర, డీఈ, ఆర్అండ్‌బీ, పత్తికొండ**

సమస్యలను వేగంగా పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు...

కోసిగి మండలం సజ్జలగూడెం గ్రామానికి చెందిన యల్లప్ప తనకు పెద్దకడుబూరు మండల దేరవగట్టు గ్రామ సర్వేనెంబర్ 28-2ఏ లో 30సెంట్లు, సర్వేనెంబర్ 28-3ఏలో 95 సెంట్ల భూమి ప్రభుత్వం నుంయి వచ్చిందని, ఆన్‌లైన్‌లో 75సెంట్లు మాత్రమే చూపిస్తుందని, మిగతా భూమిని కూడా నమోదు చేయించాలని కోరారు.

ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామానికి చెందిన సతీష్, శేఖర్, తిక్కప్ప, హనుమంతు 30 ఎకరాల భూమికి సంబంధించి దారి లేకుండా చేశారని దారి ఏర్పాటు చేయలని అర్జీ సమర్పించుకున్నారు.

ఆదోని పట్టణం 5వ వార్డు మెయిన్ రోడ్డు గుంతలు పండిందని మరమ్మతులు చేయిం చాలని కాలనీ వాసులు అర్జీ సమర్పించు కున్నారు.

తమ ఇంటిపక్కనే దిబ్బలు ఉండి, పురుగులు, దోమలు, క్రిమికీటకాలు వస్తున్నా యని దిబ్బను తొలగలించాలని ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన కె.రవి కుమార్ అర్జీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏవోకే వసుంధర, సర్వేయర్లు శ్రీనివాసరాజు, వేణు సూర్య, డీఎల్‌డీవో, నూర్జహాన్, అర్డబ్ల్యూఎస్ ఏఈ పద్మజ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, హౌసింగ్ డీఈ రవికుమార్ పాల్గొన్నారు.

హాస్టల్‌ను మార్చాలి

ఆదోని అగ్రికల్చర్: పట్టణంలోని శిథిలావస్థకు చేరుకున్న ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్ భవనాన్ని మరో భవనంలోకి మార్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. హాస్టల్ భవనం కూలెందుకు సిద్ధంగా ఉందని, ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రమాదం జరిగేలోపు స్పందిచాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. శశిధర్, రాజు, గణేష్, యశ్వంత్, రవితేజ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వలసబాట..

- స్థానికంగా పనుల్లేక వలస వెళ్తున్న వ్యవసాయ కూలీలు


తుగ్గలి నుంచి వలస వెళ్తున్న వ్యవసాయ కూలీలు

తుగ్గలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతమైన తుగ్గలి మండలం నుంచి వలసలు ఆగడం లేదు. ప్రతి రోజు వలస వెళ్తానే ఉన్నారు. సోమవారం తుగ్గలి నుంచి దాదాపు 20 కుటుంబాలు బొలేరో వాహనంలో తెలంగాణ రాష్ట్రానికి వలస వెళ్లారు. మూడు రోజుల నుంచి మారెళ్ల తదితర గ్రామాల నుంచి కూడా తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. కూలీలు మాత్రమే వెళ్లకుండా వారి వెంట తమ పిల్లలను కూడా వెంట బెట్టుకుని వెళుతుండటంతో వారి చదువు దెబ్బతింటుంది. గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తయ్యాయని, పనులకు వెళితే.. తప్ప పూట గడవవని, పస్తులు ఉండలేక పట్టణాలకు వలస వెళ్తున్నామని కూలీలు అన్నారు.

మారెళ్ల సచివాలయం తెరిచేదెప్పుడు?


సచివాలయానికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తుగ్గలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల గ్రామ సచివాలయం మధ్యాహ్నం 12 గంటలైనా తెరుచుకోలేదు. దీంతో పనుల నిమిత్తం వచ్చిన కొందరు ప్రజలు పడిగాపులుకాసి నిరాశతో వెనుదిరిగారు. పెట్టుబడి సాయం అందించాలని వినతి పత్రం అందించేందుకు వచ్చిన సీపీఐ నాయకులు సచివాలయానికి వినతి పత్రం అందించారు. ఉదయం 10 గంటలకు రావలసిన అధికారులు, ఉద్యోగులు మధ్యాహ్నం 12 గంటలైనా రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి విధులకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతు కుటుంబానికి ప్రభుత్వం అండ

ఆలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతు కురవ దులప్ప కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలుగు రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం అరికేరలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. సర్పంచి కుప్పగల్లు నాగరాజు, టీడీపీ మండల నాయకులు బొగ్గుల రాముడు. బలరాం చౌదరి, భీమేష్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న నారాయణ రెడ్డి

పోరాటాలకు సిద్ధం కావాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షాబీర్ భాష పిలుపునిచ్చారు. సోమవారం కార్యాలయంలో వైఎస్సార్ ఎస్‌యూ విద్యార్థి విభాగం నుంచి లింగప్పతో పాటు 15 మంది కార్యకర్తలు ఏఐఎస్ఎఫ్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వామపక్ష భావజాలాలకు ఆకర్షితులై మళ్లీ తిరి ఏఐఎస్ఎఫ్‌లోకి రావడం శుభ పరిణామం అన్నారు. కలిసి కట్టుగా విద్యారంగ సమస్యలపై పోరాడాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి దస్తగిరి, నాయకులు శివ, శ్రీకాంత్, వీరేష్, వీరు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

ఆలూరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ జె రంగమ్మ సోమవారం తెలిపారు. వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా. గృహనిర్మాణ, ఉపాధి హామీ, విద్యుత్, విద్య తదితర శాఖలపై చర్చిస్తామన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ముగిసిన ఉత్సవాలు

పత్తికొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం, పెద్దహుల్తి గ్రామంలో మూడు రోజులుగా వైభవంగా జరిగిన శ్రీహుల్తి లింగేశ్వరస్వామి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. రెండు రోజులుగా బీరప్పడోళ్లు, గొరవయ్యల నృత్యాలతో మార్మోగిన హుల్తి లింగేశ్వర స్వామి ఉత్సవాలకు అటు కర్నాటక, ఇటు తెలంగాణ, భక్తులు వచ్చారు. సోమవారం శ్రీహుల్తప్ప, కారుమంచప్ప ఉత్సవ మూర్తులను వీధుల్లో ఊరేగింపు నిర్వహిం చారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కాలువలపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని సీపీఎం నాయకులు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. రోడ్ల విస్తరణ సందర్భంగా సైడు కాలువలు నిర్మిస్తే వాటిపై దుకాణలు నిర్మించరాని అన్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడిందని, ట్రాఫిక్ సమస్య తలెత్తిందన్నారు. పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. నాయకులు ప్రభాకర్, వలి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద హరివాణం జడ్పీహెచ్ పాఠశాల పదో తరగతి విద్యార్థి బోయ తలారి గర్జప్ప జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఇందిరా దేవి, పీఈటీ రామన్న తెలిపారు. సోమవారం విద్యార్థిని అభినందించారు. గత నెల అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ కనపరిచారన్నారు. ఈనెల 16నుంచి మధ్యప్రదేశ్ నర్సాంగీపూర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టులో గర్జప్ప ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎస్ఎంసీ చైర్మన్, రమేష్, ఉపాధ్యాయులు రమణమూర్తి, శివరాజ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు పత్తికొండ విద్యార్థి

పత్తికొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి కొండపల్లి పెద్దయ్య అండర్ -17 రాష్ట్రస్థాయి క్రికెట్‌పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మాలతి తెలిపారు. ఈనెల 2వ తేదీన కర్నూలులో జరిగిన అండర్-17 సెలక్షన్స్‌లో ప్రతిభచూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్ల పాల్గొంటారని అన్నారు. పీఈటీ ఆగోల రాజేష్, రిజియాభాను, దేవిబాయిని హెచ్ఎం అభినందించారు.

పెట్టుబడి సాయం అందించాలి

పత్తికొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు కారన్న, అధ్యక్షుడు వీరన్న డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో సచివాలయాల్లో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కూటమి అధికారంలోకి వస్తే రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయం కింద ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. నాయకులు గురుదాస్, గిడ్డయ్య ఉన్నారు.

కూటమి హామీ నెరవేర్చాలి

తుగ్గలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని సీపీఐ నాయకులు కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం బొందిమడుగులలో డిజిటల్ అసిస్టెంట్ నాయక్‌కు వినతి పత్రం అందించారు. దిగుబడి, ధరలు లేక రైతులకు అప్పులే మిగిలాయని, రూ.20వేలు అందజేసి, భీమాకు ప్రభుత్వమే చెల్లించాలని కోరారు.

ప్రాజెక్టులు పూర్తి చేయాలి


మంత్రులకు విన్నవిస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్

ఆలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పెండింగ్ ఉన్న వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేయాలని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ కోరారు. సోమవారం కర్నూలులో మంత్రులు నిమ్మల రామానాయుడు, టీజీ భరత్‌ను కలసి విన్నవించారు. గత వైసీపీ ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టు, నగర డోణ ప్రాజెక్టు నిర్మాణం పను లను ప్రారంభించి, నిలిపివేసిందన్నారు. నీటి వనరులు లేక పంటలు పండక గ్రామాల పజలు బ్రదుకుదెరువుకు వలసలు వెళ్తున్నారన్నారు. ప్రాజెక్టులు పూర్తి అయితే సాగు, త్రాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని వివరించారు.

భూ వివాదాలు తలెత్తకుండా చూస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు తలెత్తకుండా సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ గోవింద్ సింగ్ తెలిపారు. ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.


తహసీల్దార్ గోవింద్ సింగ్

ప్రశ్న: భూ సమస్యలను ఎలా పరిష్కరిస్తారు?

జవాబు: కలెక్టర్ ఆదేశాల మేరకు రీ సర్వే జరిగిన గ్రామాల్లో సభలు నిర్వహించి రైతుల ద్వారా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తాం.

ప్రశ్న: రేషన్ దుకాణాలను ఎలా పర్యవేక్షిస్తారు.?

జవాబు: రేషన్ దుకాణాల్లో నిత్యవసర వస్తువులు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూస్తున్నాం. ఎవరైనా డీలరులు సరుకులు ఇవ్వలేదని ఫిర్యాదు వసేస్త వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ లేదని విమర్శలున్నాయి.?

జవాబు: త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో, ఎంఈవోతో కలసి పర్యవేక్షిస్తాం. మెనూ పాటించకుంటే ఏజెన్సీలను రద్దు చేస్తాం.

ప్రశ్న: వీఆర్వోల పనితీరు ఎలా ఉంది.?

జవాబు: పనిచేయని వీఆర్వోలపై చర్యలు తీసుకుంటాం. సచివాలయ వీఆర్వోలు గ్రామ స్థాయిలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి.

ఉపాధిలో అవినీతిపై విచారణ



పెద్దమరివీడులో విచారణ చేస్తున్న ఉపాధి హామీ అధికారులు

గోనెగండ్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెద్దమరివీడు గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సీనియర్ మేట్ అవినీతికి పాల్పడినట్లు నివేదికలు అందడంతో సోమవారం గ్రామంలో గ్రామ సభలో ఉపాధి హామీ ఏపీడీ అల్లీపీర, క్లస్టర్ ఇన్‌చార్జి బషీర్, ఏపీవో మోహమ్మద్ బాషా విచారణ చేపట్టారు. ఉపాధి పనులలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, అంగన్‌వాడీ వర్కర్, గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల పేర్లపై దొంగ మస్టర్లు తయారు చేసి నిధులు స్వాహా చేశారని అందుకు గాను చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు నాగరాజు, ప్రభుదాస్ ఫిర్యాదు చేశారు. విచారణ నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని వారు తెలిపారు. విచారణలో పంచాయతీ కార్యదర్శి మద్దలేటి, ఈసీ ఉస్మాన్, టీఏ రోగెన్న గ్రామ రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి టీడీపీ కృషి: తిక్కారెడ్డి



తిక్కారెడ్డిని కలిసిన మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, బీసీ నాగరాజు

ఎమ్మిగనూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీజీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో సామాజిక వేత్త, వికలాంగుల సంక్షేమ సంఘాల గౌరవాధ్యక్షుడు మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, దివ్యాంగుల సాధికార ఫోరం జిల్లా నాయకులు బీసీ నాగరాజు, జేఏసీ సభ్యులు తిక్కారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఆలూరు నుంచి అమరావతి వరకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి దివ్యాంగుల కృతజ్ఞత పేరిట త్వరలో ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. ర్యాలీకి సహకారం అందించాలని తిక్కారెడ్డిని కోరారు. ఇందుకు తిక్కారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు చేపట్టబోయే ర్యాలీకి తనవంతు సహకారం ఉంటుందన్నారు. అనంతరం ఏపీ ఎన్జీఓ భవన్‌లో దివ్యాంగులు జిల్లా సమావేశం అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శివశంకర్, నాయకులు ఆదిశేషయ్యలు నిర్వహించారు. నాయకులు వీరేష్, వెంకటేష్, రాజశేఖర్ గౌడ్, నరసింహులు, దోని బజారి, రంగన్న, రామదాసు, మల్లికార్జున, రాజు, రామన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఊరి నుంచి వలస బాట



రాంపురం గ్రామం నుంచి వలస వెళ్తున్న కూలీలు

మంత్రాలయం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల నుంచి వలసలు వెళ్తూనే ఉన్నారు. సోమవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సొంత గ్రామమైన కొత్తరాంపురం నుంచి దాదాపు 30 కుటుంబాలు వలస వెళ్లారు. తెలంగాణలో పత్తిపంటలో కూలీపనులు చేసేందుకు వృద్ధులను ఇంటిదగ్గర వదిలి పిల్లాపాపలతో వెళ్లారు. ఇప్పటికే మంత్రాలయం మండలంలోని మాధవరం, రచ్చుమర్రి, సుంకేశ్వరి, మాలపల్లి, సింగరాజనహల్లి, చిలకలడోణ, వగరూరు, సూగూరు గ్రామాలనుంచి పెద్ద ఎత్తున వలసలు వెళ్లారు. బడిపిల్లలు సైతం తల్లిదండ్రులతో వలసబాట పట్టడంతో పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం తగ్గుముఖం పట్టింది.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

మంత్రాలయం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని అండగా ఉంటామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మంత్రాలయం పంకజ అతిథిగృహంలో నిర్వహించిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండలాల్లోని కార్యకర్తలకు అన్నిరకాలుగా న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్ స్వామి, నాగసేన ఆచార్, ఎల్లారెడ్డి, విజయరామిరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు యోబు, కేశన్న, సుంకన్న, నరసింహులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి: ఎంఈవో



మాట్లాడుతున్న ఎంఈవో ఆంజనేయులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈవో ఆంజనేయులు కోరారు. సోమవారం పట్టణంలోని స్థానిక సిద్ధార్థ డిగ్రీ కాలేజీలో డిజిటల్ విద్య అవగాహన కార్యక్రమంలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో సొసైటీ ఫర్ రూరల్ ఎకో డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సొసైటీ డైరెక్టర్ దామోదర్, ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ అటల్ యోజన, సుకన్య సమృద్ధి యోజన పథకం, ఇన్సూరెన్స్, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీలు వివరించారు. అలాగే విద్యాలక్ష్మి, విద్యా రుణాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో శ్రీనివాస్, ఎస్‌బీఐ గోపీకృష్ణ, జయవర్ధన్, గుడికల్ లక్ష్మన్న పాల్గొన్నారు.

పాఠశాలల్లో తగ్గిన హాజరు శాతం

- తల్లిదండ్రులతోపాటు పిల్లలూ వలస బాట
- వలసలు నివారించలేని అధికారులు

కోసిగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతలో దేశంలోనే చిట్టచివరి నుంచి రెండో స్థానంలో ఉన్న కర్నూలు జిల్లా కోసిగి మండలంలో నేటికీ మార్పు రావడం లేదు. ఇక్కడ పరిస్థితుల వల్ల ప్రతి ఏటా వలస కూలీలు, రైతు కూలీలు వలసబాటలో పట్టడంతో తల్లిదండ్రుల వెంట పిల్లలు సైతం సుగ్గిబాట పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం వలసబాట పట్టే విద్యార్థుల కోసం సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేస్తే.. విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉంది. దీంతో అక్షరాస్యత కూడా మెరుగు పడవచ్చు. వలసల ఎఫెక్ట్‌తో ప్రభుత్వ బడులలో విద్యార్థుల హాజరు శాతం సగానికి పైగా పడిపోయింది. వలసల కారణంగా ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులపై ఎంతగా ఉందో కోసిగి మండల కేంద్రం లోని హిందూ గర్ల్స్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం చూస్తే అర్థమైపోతుంది. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులు 473 మందికి గానూ 165 మంది మాత్రమే విద్యార్థులు హాజరవుతున్నారు. సుమారు 308 మంది విద్యార్థులు హాజరు తగ్గిపోవడమే వలసలు ఎంతగా ఉన్నాయో అర్థమవుతుంది. తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు వలస వెళ్లిపోయారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు మండలంలో 5949 మంది చదువుతుండగా.. ఇందులో 40 శాతం మంది విద్యార్థులు వలసబాట పట్టారు. దీంతో వచ్చే ఏడాది పదవ తరగతి పరీక్షలో ఉత్తీర్ణత శాతం తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యాశాఖ యంత్రాంగం పట్టించుకుని విద్యార్థులు వలస వెళ్లకుండా వారి కోసం సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



తల్లిదండ్రులతో కలిసి వలస వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)



ఒకటో తరగతి గదిలో పూర్తిగా తగ్గిన విద్యార్థుల హాజరు శాతం

సీజనల్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి



వలస వెళ్లకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారి చదువుల కోసం ప్రభుత్వం సీజనల్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి. తల్లిదండ్రుల వెంట విద్యార్థులు వలస వెళ్తున్నారు. విద్యాధికారులు నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారు.

- ఎస్.వీరేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి

విద్యార్థులు తల్లిదండ్రుల వెంట వలస వెళ్తున్నారు

బడుల్లో చదువుకునే విద్యార్థులు తమ తల్లిదండ్రుల వెంట వలసబాట పడుతున్నారు. సుమారు మా పాఠశాలలో 60 శాతం పైగా విద్యార్థుల హాజరు శాతం తగ్గింది. మేము విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నా.. మేము వెళితే.. ఇంట్లో ఎవరు ఉండరని కాబట్టే మా పిల్లలను వెంట తీసుకెళ్తున్నామని చెబుతున్నారు.

- సంజన్న, ఎంపీపీ హెచ్‌జీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

ఎల్.మాధవశెట్టి, ఏఏవో శ్రీమఠం, మంత్రాలయం



మంత్రాలయం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని రాఘవేంద్రస్వామి మఠం అసిస్టెంట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎల్.మాధవశెట్టి అన్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: శ్రీమఠంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టారు.

జవాబు: భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు మఠం పీఠాధిపతి సుబుధేం ద్రతీర్థుల ఆధ్వర్యంలో వంద గదుల సముదాయం నిర్మించి వసతులు కల్పించాం. జల ప్రసాదం పేరుతో మూడు చోట్ల ఉచితంగా మినరల్ తాగునీరు పంపిణీ చేస్తున్నాం. మధ్వమార్గ్ కారిడార్ మరింత పొడిగించనున్నాం.

ప్ర: భక్తులకు ఎలాంటి వసతి కల్పిస్తున్నారు?

జ: దర్శనార్థం వచ్చే భక్తులకు మూడు సీఆర్వో ఆఫీసులు (ఏబీసీ) ఏర్పాటు చేసి దాదాపు 1300 గదులు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో భక్తులు చెల్లించి గదులు పొందవచ్చు.

ప్ర: రోజుకు ఎంత మంది భక్తులు వస్తున్నారు?

జ: గురువారం, ఆదివారం సెలవుదినాల్లో దాదాపు 50నుంచి 75వేల మంది దాకా భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. వారికి ప్రత్యేక క్యూలైన్లు, పరిమళ ప్రసాదాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందజేస్తున్నాం.

ప్ర: భక్తులకు ఉచిత అన్నదానం ఏయే సమయాల్లో కల్పిస్తున్నారు..?

జ: రాఘవేంద్రస్వామి దర్శనానంతరం అన్నపూర్ణ భోజనశాలలో మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. రోజుకు 30వేల నుంచి 40వేల వరకు భోజన సౌకర్యం కల్పిస్తున్నాం.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

మంత్రాలయం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికల్లో వృత్తిని కొనసాగించే కాటి కాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించాలని కేవీపీఎస్ మండల అధ్యక్షుడు మారెప్ప అన్నారు. సోమవారం మాధవరం గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్న అంజినేయ, ఏలియా, దేవపుత్ర, అశోక్, జయరాజు, ఇజ్రాయేల్, హంపయ్యలు పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు







ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కోసిగిలోని మార్కండేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు, ఆకాశ దీపాన్ని వెలిగిస్తున్న అర్చకుడు

గోనెగండ్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ఈశ్వరదేవాలయాలు ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి. అలాగే మండల పరిధిలోని గోనెగండ్ల, గాజులదిన్నె, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, వేముగోడు, గంజహళ్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గోనెగండ్లలోని నీలకంఠేశ్వరదేవాలయంలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి మహా రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు.

ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిలో ఎమ్మెల్సీ

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు తెల్లవారుజామునే ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మహా మంగళహారతితో పూజించి భక్తులకు దర్శనం కల్పించారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకోగా మరి కొంత మంది భక్తులు స్వామి వారి నైవేద్యం సమర్పించారు. ఈవో, డిప్యూటీ కమిషనర్ విజయరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఆలయంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా, ఉరుకుంద ఈరన్న స్వామి వారిని సోమవారం ఎమ్మెల్సీ బీటీ నాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటాయని ఎమ్మెల్సీ బీటీ నాయుడు తెలిపారు.

కోసిగి: కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని కోసిగిలోని మార్కండేయస్వామి దేవాలయంలో భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాత్రి దేవాలయంలో కార్తీక మొదటి సోమవారం సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు శివునికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి దీపకాంతులతో దేవాలయాలు వెలుగొందాయి. కోసిగి మార్కెండేయ స్వామి దేవాలయంలో రాత్రి చెక్కభజన కార్యక్రమాలు నిర్వహించారు.

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి సన్నిధానంలోని గర్భగుడిలో వెలసిన శివలింగానికి పీఠాధిపతి సుబుధేం ద్రతీర్థులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి హారతులు ఇచ్చారు. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో రాఘవేంద్రస్వామి మఠంతో పాటు మంత్రాలయం రామలింగేశ్వరస్వామి ఆలయంలో బిల్వపత్రాలు, పుష్పాలతో అష్టోత్తర పారాయణం గావించారు. కుంకుమ, విభూతి, గంధంతో మహాభిషేకం చేసి సామూహిక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. కార్తీకదీపాలను వెలిగించడం కోసం శివాలయాల వద్ద భక్తులు కిక్కిరిశారు. మాధవరం, రాంపురం, వగరూరు, మాలపల్లి తదితర గ్రామాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. కార్యక్రమంలో వీరస్వామి, సిద్ధ లింగయ్యస్వామి, ఆడిట్ శంకర్, హంపయ్యలు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో జమ చేయాలి



కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న పంపన్నగౌడు

నందవరం, నవంబరు 4(ఆంధ్యజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తున్న రూ. 20వేలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు డిమాండ్ చేశారు. సోమవారం నందవరంలో పంచాయతీ కార్యాదర్శి విజయలక్ష్మీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శాంతప్ప, విజయ్‌కుమార్, అంజినేయులు, ముని, తిమ్మప్ప పాల్గొన్నారు.

పంట కాలువలో చెత్త తొలగింపు



పంట కాలువలో చెత్తను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఎమ్మిగనూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పంటకాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో సాగునీరు మురుగుకాలువలో వృథాగా పోతున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఇందుకు స్పందించిన ఎల్లెల్సీ అధికారులు సోమవారం పట్టణంలోని ప్లేగమ్మ గుడిదగ్గర పంట కాలువలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని, కాలువ వెంబడి ఏపుగా పెరిగిన ముళ్లకంపలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గించి ప్లేగమ్మ గుడిదగ్గరనుంచి క్లీనింగ్ పనులను మొదలు పెట్టారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కోసిగి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం టీడీపీ నాయకులు ఎన్.రామకృష్ణారెడ్డి, ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ హాజరయ్యారు. ముందుగా ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ధ్వజస్తంభానికి, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక టీడీపీ నాయకులు తాయన్న, చిన్న మారెయ్య, మాన్వి రామయ్య, నారాయణ తదితరులు సన్మానించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తా: ఎమ్మెల్యే



జాతీయ స్థాయికి ఎన్నికైన విద్యార్థిని షేక్ ముస్కాన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో క్రీడల్లో రాణించే విద్యార్థులకు తన వంతు ఆర్థిక సాయం అందించి వారిని ఉన్నత క్రీడల కోసం ప్రోత్సాహిస్తామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. సోమవారం మంత్రాలయం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదివే షేక్ ముస్కాన్ అను విద్యార్థిని ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించి జాతీయి స్థాయికి ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్లు నరసింహరాజు, బసవరాజు విద్యార్థిని ఎమ్మెల్యేకు పరిచయం చేసి జమ్మూకాశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో 68వ ఎస్జీఎఫ్ అండర్-14 ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. అదే విదంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డిలు అభినందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

వ్యక్తి అరెస్టు, ఆటో సీజ్



పట్టుబడిన కర్ణాటక మద్యం, ఆటోతో పోలీసులు

మంత్రాలయం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన బోయ మల్లికార్జున అనే వ్యక్తి తన ఆటోలో కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తెస్తుండగా మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్, గురుమూర్తి పట్టుకున్నారు. సోమవారం మాధవరం సమీపంలో ఆదోని రోడ్‌లో ఆటోలో మూడు బాక్సులోని 264 కర్ణాటక 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకొని, ఆటోను సీజ్ చేసి వ్యక్తిని అరెస్టుచేశారు. నిందితుడిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌డీపీఐ నూతన కమిటీ ఎన్నిక

ఎమ్మిగనూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్‌డీపీఐ పార్టీ ఎమ్మిగనూరు నూతన కమిటీని సోమవారం ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో ఆలూరు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హమీద్, అబ్దుల్ సుభాన్ ఆధ్వర్యంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు అసెంబ్లీ అధ్యక్షులుగా హుసేన్, ఉపాధ్యక్షుడు హఫీజ్ జాహీర్ సాబ్, జనరల్ సెక్రటరీగా అబ్దుల్ సుకూర్, సెక్రటరీగా నూర్ అహ్మద్, ట్రెజరర్‌గా ఖలీల్‌లతో పాటు ఆరు మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు హుసేన్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రజాసమస్యలపై, దేశవ్యాప్త సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తుందన్నారు. నాయకులు హాజీఖాదర్ సాబ్, మక్బుల్, హారున్, చాంద్, సలాం, షేక్షావలి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు

రైతులకు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఒక్క రోజు శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రసహాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు

గోనెగండ్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రబీలో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రసహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం గోనెగండ్లలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఒక్క రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కందిలో కాయ ఈగ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ హేమలత, ఏఓ శశిధర్‌రెడ్డి, మధుమతి, రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో సీట్లు అమ్ముకుంటున్నారు : టీడీపీ

పెద్దకడుబూరు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 4: కేజీబీవీల్లో పేద విద్యార్థులకు ఇవ్వాల్సిన సీట్లను విద్యాశాఖ అధికారులు అమ్ముకుంటున్నారని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి ఆరోపించారు. సోమవారం కర్నూలుకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడికి టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు అవకాశం కల్పించడం లేదన్నారు. పాఠశాలకు డబ్బులు, కుర్చీలు ఇచ్చిన వారికే అవకాశం ఇస్తున్నారని ఆరోపించారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులు సీటు రాక, కూలీలకు వెళ్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇళ్ల ముందు మురుగు నీరు



చిర్తనకల్‌లో ఇళ్ల ముందు నిలిచిన మురుగు నీరు

కోసిగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిర్తనకల్, కామన్‌దొడ్డి గ్రామాల్లో ప్రధాన రోడ్లపైన ఇళ్ల ముందు డ్రైనేజీ, వర్షంమురుగు నీరు నిల్వ చేరి దుర్వాసన వస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిర్తనకల్ గ్రామంలోని ప్రధాన రోడ్డుపై మురుగునీరు నిల్వ చేరి దోమలబెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామ ప్రజలు చెబుతున్నారు. కామన్‌దొడ్డి గ్రామంలో ప్రధాన రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండటంతో నడవడానికి దారి లేక పాచి పట్టిన నీరు కుంటలా తయారైందని రాత్రివేళలో దోమల బెడదతో జ్వరాల బారిన పడుతున్నామని పంచాయతీ అధికారులు, గ్రామ సర్పంచ్ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.